

యలమంచిలి
ఝాన్సీలక్ష్మి

వేణుగోపాలుని కన్నులనిండుగా వెన్నెల వన్నెలే తళుక్కు మంటున్నాయి. ఆ కరుణా విభవుని సన్నిధిలోనే 'భాస్కరం' జీవితంలో అగ్నిసాక్షిగా అర్ధాంగిగా అడుగు పెట్టాను. మనస్సున ఆ మంగళాకారుని మురళి మధురాతిమధురంగా మ్రోగుతోంది.

ఆయన డాక్టరు. నేను ప్లీడర్ని. బాధల్ని తొలగించడానికి ప్రయత్నించే మనస్సున్న మనిషి ఆయన. న్యాయం కోసం పోరాడాలని ఆశతో వూగిపోతున్న వయస్సు నాది.

అమ్మకు వైద్యం చేయడానికివచ్చి 'లా', చదువుతున్నానని తెలియగానే ప్రశంసించారెంతగానో.

'మీలాంటివాళ్లు మాటి కొక్కరైనా వుంటే స్త్రీ జాతి తప్పకుండా ముందడుగు వేస్తుంది. కరుణాదేవీ!' అంటూ.

ఎప్పటినుంచో కలల నల్లుకుంటూ వూహల వూయలలో వూగిపోతూన్నాను ప్లీడర్ని కావాలని, అన్యాయాన్ని వోడించాలని. కానీ ఒక్క నాన్నగారు తప్ప అందరూ 'ఆడపిల్ల—అవ్వ—కోర్టులో నిలబడి బల్లగుద్ది వాదించుతుందా! ఛా! ఎంత సిగ్గులేని పని!' అంటూ విమర్శించి నోరు నొక్కుకునేవాళ్లే. అందుకే భాస్కరంగారి ప్రశంసోక్తి వినగానే కొండంత ధైర్యం మేల్కొంది లోలోన. ఆయన ఎంతో సభ్యతగా మెలగేవారు.

పొరపాటునకూడా ఒక్క అసభ్యపు మాటైనా అనేవారుగాదు. పరిచయంలో వున్న చనువును పురస్కరించుకుని ఏనాడూ అతిగా ప్రవర్తించ లేదాయన. నామనస్సున ఏ మధురక్షణాన ఆ డాక్టరికై అనురాగం అందాల మందిరాన్ని నిర్మించింది నాకు తెలియకుండానే.

రెండుమూడుసార్లు ఆయన పని చేస్తూన్న హాస్పిటలుకి వెళ్లాను నేను కూడా. ఎంతో మర్యాదగా పలుకరించారు. నవ్వుతూ ఆహ్వానించారు. ఆ నవ్వులో మధురిమలు సరిగమల్ని పూయించాయి. వెన్నెల కురిసిన ఆ చిరునవ్వు నాలో మధురోహల్ని పండించింది. ఆయన కన్నుల్లోకి చూస్తూ కావ్యాల నల్లుకోవచ్చని కలలుగన్నాను. కథలు సృజించుకోవచ్చని మురిసి, మైమరిచిపోయాను. అంత నిర్మలంగా వుండేవా చూపులు.

అమెరికాలో కొన్నాళ్లు చదివి వచ్చారు. డాక్టరు. వెనుక తల్లీదండ్రీ లేరనీ చెప్పుకో దగిన బంధువులు కూడా లేరనీ చెప్పారు ఆ హాస్పిటల్లోవున్న రెండు సంవత్సరాల్లోనూ ఎంతో మృదుహృదయుడిలా ప్రవర్తించారు. రోగుల్ని కావలసినంత సానుభూతితో పరీక్షించేవారు. ఎంతో ఓర్పుగా వినేవారు రోగులు చెప్పినదంతా.

ఆ వయస్సున అందమూ, ఆకర్షణా, చదువూ, హోదా అన్నీ వున్న ఆ యువకునిపై ఎంతోమందికి ఆసక్తి పెరిగింది. నాన్నగారుకూడా ఆయన్ని ప్రత్యేకంగా చూసేవారు. ఇంట్లో ఏ చిన్న విందు జరిగినా ఆహ్వానించేవారు. ఛలోక్తులతో నవ్వించేవారు.

ఓనాడు 'మా కరుణను నీ చేతుల్లో పెట్టాలనుందోయ్!' అన్నారు. ఆయన వినమ్రంగా అంగీకరించారు.

నా మనస్సున మల్లెలుమాలలు నల్లుకున్నాయి. మధురోహల సందడితో నా హృది విరిసిన మందారమే అయ్యింది.

అమ్మకోరికపై వేణుగోపాలుని ఆలయాన జరిగింది వివాహం. మరో మలుపు తిరిగిందా క్షణంతో నా జీవితం. మనస్సున నిలిచిన ఓ మధురమూర్తికి అర్పించుకున్నాను నా జీవన కావ్యాన్ని.

నాన్నగారు జడ్జీకావడం మూలాన ఎన్నో కేసుల్ని నాచేతకూడా పరిశీలింపజేసేవారు. రానురాను పూర్తిగా ప్రతి కేసునీ పరిశీలించడం నేర్చుకున్నాను.

నాన్నగారిపేరు దూరతీరాలక్కూడా 'మంచి న్యాయవాది' అని వ్యాపించింది శ్రీమతి కరుణాదేవికూడా తండ్రికిదగ్గ కూతురేనన్న ప్రశంసకూడా బయల్దేరింది త్వరలోనే.

మరోవైపున శ్రీవారి సహకారం కొండంత. ఎంతో ఆనందంగా వుండేది నాకాయన సన్నిధి. ఇంటిదగ్గరున్నంతసేపూ 'కరుణా! కరుణా!' అంటూ కబుర్లతో హాస్యోక్తులతో కాలాన్ని పరువులెత్తించేవారు.

ఆరోజు నాడైరీలో—కాదు కాదు. జీవితంలోకే మరచిపోలేని రోజు. దీపావళి. దీపాల పందిరిలా కనులపండువుగా వెలిగిపోతోంది లోకమంతా. మతాబాల వెలుగుల్లో పాపల వదనారవిందాల నిండుగా ఆనందం నృత్యం చేస్తోంది. యువకుల ఎడదల్లో వుత్సాహం పరవళ్లు తొక్కుతోంది.

ఎవరో విందుకని ఆహ్వానించారు. వెళ్లిన ఆయన యింకా తిరిగిరాలేదు. అమ్మగారింటికి వెళ్దామనుకునీ కారు లేకపోవడం మూలాన విరమించుకున్నాను. తోటలో కుర్చీ వేయించుకున్నాను. గేటు తీసిన చప్పుడైంది కొంతసేపటికి. పూల అందాల్ని చూస్తూ మైమరిచిపోయి వున్నానేమో, ఆ శబ్దానికి వులిక్కిపడ్డాను. ఆవేళలో ఎవరా వచ్చిందని ఆశ్చర్యపోయాను. బహుశః ఏ అర్జంటు కేసో వచ్చి ఆయనకోసం వచ్చారేమో ననుకున్నాను.

'లోపలికి రావచ్చునా?' అన్నదో యువతి లేత నీలిరంగు చీరలో వినయం మూర్తీభవించినట్లు నిల్చున్నదామె. ఆ సువిశాల నయనాల్లో నీలినీడలు పారాడుతున్నాయి. విచారం గూడుకట్టుకుని వుందాచూపుల్లో.

'రండి!' అన్నాను ఆశ్చర్యంనుంచి తేరుకుని. మరోకుర్చీ తెప్పించా నామెకోసమని. కానీ కూర్చోనే లేదామె ఎంతగా చెప్పినా. ఆ కళ్లల్లో ఎందుకో భయం కదులుతోంది ఇంటివైపు చూస్తోంది మాటిమాటికీ. ఒకవేళ ఏదైనా తగాయిదాయేమో ననుకున్నాను.

'ఫర్వాలేదు కూర్చోండి. ఇక్కడికెవ్వరూ రారు. చెప్పండి అన్నాను. అప్పటికీ కూర్చునేప్రయత్నం కూడా చేయలేదామె. ఎవరో ఆమెను వెంటబడి తరిమి యిక్కడికి పంపించినట్లు భయంతో వణికిపోతోంది.

'మీరు...' ఎవరైనదీ తెలియక ఆగిపోయాను. అమాయకత్వం నిండిన ఆ కళ్లతో నావైపు చూసింది ధైర్యం చేసి.

'నేను......నేను...మీకు దగ్గరి బంధువునే...వరుసకి అక్కయ్యనౌతాను' ఎవరో నేర్పినట్లు పాఠంలా వల్లించింది. ఆశ్చర్యపోయాను. అక్కయ్యనౌతానంటున్నదీ. మా బంధువులంతా నాకు తెలుసు

వాళ్లల్లో ఏ మారుమూలలోనూ అక్కయ్యలు లేరు. పోనీ ఆయనవైపు వాళ్లా అనుకోడానికి ఏనాడూ ఒక్కపిట్టైనా వచ్చిన పాపాన పోలేదు. అందుకే మాట్లాడలేక పోయాను వెంటనే. పల్లెటూరిలో పెరిగిన బంతిపువ్వులా అమాయికంగా వుందామె.

'ఈ వుత్తరాలు చూడండి దయ చేసి—' అన్నది వణుకుతూన్న స్వరంతో. కూర్చోమని చెప్పాను మరోసారి. జాబును విప్పాను. 'డియర్ అన్నపూర్ణా!' అని వుంది.'

'అన్నపూర్ణ అంటే...'

'నేనే...ఆయన... మా బావే!' అన్నది నేరస్థురాలిలా తలవంచుకుని.

'ఆ! మీ బావా? నిజమేనా?' ప్రాణం పునైన ప్రశ్నించాను.

'నిజమే! నేనసలు అబద్ధాలు చెప్పలేనండీ!' అంటూన్నట్లు దీనంగా చూసిందామె నా వంక. ఆ దీనత్వాన్ని చూడగానే నా హృదయం ద్రవించి పోయింది. రెండో జాబు విప్పాను, వరుసగా అయిదారు చదివాను.

ముత్యాల్లా అల్లుకుని వున్నాయి అక్షరాలన్నీ. తీయని వూహాలు హాయిని కురిపించే మలుపులతో మనస్సును ఝల్లుమన్పించు తున్నాయి. మృదువైనభావాలు. మధురాతి మధురమైన పద్యాలు. పద్యాల నిండుగా అనురాగం అమృతమై ప్రవహించుతోంది. వలపు నిండిన హృదయాన్ని పదాల్లో పరచినట్లుంది.

చివరివుత్తరం తీశాను. దానిలోపలినుంచి వో ఫోటో జారి నా వొడిలో పడింది. చూశాను తీసి — నన్ను నేనే నమ్మలేక పోయాను. అలాగే బొమ్మలా చూస్తుండిపోయా నెంతో సేపటివరకు. ఎదుట వో మనిషివున్న మాటే మరిచిపోయాను.

జాబులోకి వంగింది హృదయం. పరమ విరోధికి వ్రాసినట్లుంది—

'చదువూ, అందం, కీర్తి, హోదా ఎన్నో వున్నాయి నాకు. ఎది ఏదో తెలుసుకోలేని పసితనంలో పెళ్లాడాను. తెలిసిన తర్వాత నా విచారానికి అవధులే లేవు. అందం లేదు. అర్థం చేసికోగల అంతరంగమూ లేదు. చదువు యింకా ఓనమాలే. ఏం చూసి నిన్ను నా భార్యవని చెప్పను?! బాల్య వివాహాలు యింత నష్టాన్ని, బాధనీ అందించుతాయని యిపుడే తెలిసింది.

అందుకే అంటున్నాను అన్నపూర్ణా! నన్నిందుకు తప్పు పట్టవద్దు. సాహసించావని శపించవద్దు.

జీవితంలో ఆనందాన్ని అందుకోవడమే నా ధ్యేయం. ఆ ఆనందాన్ని నువ్వందించలేవు. విరిసీ విరియని పరిమళంలేని సుమానివి నువ్వు. తావిలేని పూవులెందుకూ? అందమైనా లేని సుమాలతో ఎన్నాళ్లు కలిసి వుండగలం?!

నిజమే! నాకు స్వయాన అక్కకూతురివే. కాదనను — కాని అంతకుమించి యిక ఏమీగావు నువ్వు. పెద్దవాళ్లు కోర్టుకు తీసుకు వెళ్తారేమో నిన్ను! లాభం లేదని చెప్పు. ఏ శిక్షనైనా భరించగలను. కాని నిన్నుమాత్రం భరించలేను. నీకూ నాకిక ఏ సంబంధమూ లేదు.'

ఆ జాబు చదవగానే నాలో ఆగ్రహం తారాజువ్వలా లేచింది. ఆమె వంక చూశాను. ఆ కళ్లనిండుగా అశ్రుబిందువులే! ఏమడుగనింకా? పువ్వులాంటి ఆమె నేమని ప్రశ్నించను?

ఇంత మోసాన్ని ఎలా క్షమించావని అడగనా? ఎవరికీ ఎదురు చెప్పలేనంటున్నాయా చూపులు. ఇంత హాలాహలాన్ని ఎక్కడ దాచుకుందో?' ఎలా భరించిందో! మనిషిగాదూ? కోపం లేదా?

'మీరొక్కరే వచ్చారా!' అన్నాను. లేదన్నట్లు తలవూపింది. ఆ మమతామయి మాట్లాడలేదని తెలుసు.

'హోటల్లోవున్నాం! అవసరమైతే ఫోను చేయండి. ఈఅక్కయ్యకు అన్యాయం చేయరనే అనుకుంటున్నాను' అంటూ లేచి నిల్చుంది. కన్నీటి నాపుకోవడాని కెంతో ప్రయత్నించుతోంది.

ఏదో అనబోయాను. అప్పటికే గేటు దాటి రోడ్డు మీదికి వెళ్లిపోయింది. కారు బ్రరున్న చప్పుడయ్యింది. వెళ్లిపోయిందామె, నాలో మహాసంగ్రామాన్ని సృజించి.

ఫోటోవంకే చూస్తూండగా వచ్చారాయన. వెంటనే లేచి వెళ్లి పడుకున్నాను. ఎప్పటిలా నవ్వుతూ ఆహ్వానించలేక పోయాను.

'సారీ! కరుణా! ఆలస్యమైపోయింది. పిక్చరింకా మొదలై వుండదు. పద! వూ! త్వరగా!' అన్నారు. ఆరోజున సినిమాకు వెళ్లాలనుకున్నాము. నాకొక్క అడుగుకూడా కదలాలన్పించలేదు.

'అరే! కోపం వచ్చిందనుకుంటానే దేవిగారికి! ప్లీజ్ ఎక్స్‌క్యూజ్‌మి కరుణా! వాళ్లంతా ఓ ఆట వేసుకుందాం అని వదలలేదు పద! లే! వూ! క్విక్!'

'నేనురాను రాలేను' అన్నాను.

'ఏం? ఎందుకనో?'

'అంత అర్హత లేదు నాకు'

'అర్హత! ఇదేమిటి? మరెవరి

డాక్టర్ గారూ! మొన్న మా ఆఫీసులో ఒకడ్ని ఉద్యోగంలోంచి పీకేస్తే - నాకు హృదయం లేదన్నాడు కాకూడా అనుమానంగా వుంది - ఓసారి చూస్తారా?



'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాత్
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL




వాయిదాల చెల్లింపుపై ట్రాన్‌సిస్టరు



స్టాండర్డ్ (గ్యారంటీతో)
నెలకు రు. 5/-వంతున చెల్లించి, 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్ పొందండి. ప్రతి గ్రామమునకు పట్టణమునకు పంపగలము. వివరములకు:
AMBA AGENCIES (60)
Model Town, Delhi—9.





రైల్వే స్టేషన్ వద్ద: రామాలయంవీధి.


# ఇది న్యాయం

కుందంటావ్?'

'అన్నపూర్ణ అక్కయ్యకు'

'ఆవిడెవరు?!'

'డాక్టర్ భాస్కరంగారి చదువు రాని అందంలేని భార్య.' ఉలిక్కిపడ్డా రాయన విచిత్రంగా చూశారు నావంక.

'వచ్చిందా యిక్కడకి?'

'ఏం? రాగూడదా?'

'ఎందుకు వచ్చిందో?'

'న్యాయంకోసం వచ్చిందట.'

'అలాగా! సిగ్గులేకపోతే సరి! ఎలా వచ్చిందసలు ?'

'మహారాణిలా వచ్చింది. సిగ్గు! అక్కయ్యకెందుకు సిగ్గు. ఏ నేరమూ చేయనివాళ్లెందుకు సిగ్గుపడాలి! వో నేరమున్నట్లు క్షమించిందిన్నాళ్లూ! అందమూ, చదువూకావు ఆనందానికి కొలబద్దలు. మల్లెలాంటి మనస్సు ప్రధానం.'

'ఇదంతా ఆ మహారాణిగారి వుపన్యాసమేనా? ఇంత తెలివెలా వచ్చిందో? అయినా యిప్పుడెందుకీ గొడవ ? నాకూ తనకీ ఏ సంబంధమూలేదని ఏనాడో చెప్పానుగా ?' విసుగ్గా అన్నారాయన.

'అంతేనా ?'

'అంతే !' మొండిగా వుంది జవాబు.

'అయితే యింకా కరుణకూ, మీకూ ఏ సంబంధమూ లేదిక.'

'ఇదేమిటి ? నీకెందుకింత కోపం?'

'కోపం! అంతటితో వూరుకున్నందుకే సిగ్గుగా వుంది నాకు. అన్నపూర్ణ ఎవరు?అక్కయ్యే గాదు! సాటి స్త్రీ కూడా. న్యాయాన్యాయాలు అందరికీ ఒకే విధంగా వుంటాయి. ఉండాలి. ఈనాడు అన్నపూర్ణ గతి అలా అయ్యింది. రేపు నాది కాదని ఎలా అనగలను? మరో అక్కయ్య, మరో చెల్లెలు యిలా బలిగారని నమ్మకమేది ? ఎంతమంది భాస్కరాలున్నారో ? వాళ్లందర్నీ ఏం చేయగలదీ లోకం ? ఆనందం అందింది నాకు. చాలు అనుకోలేను. న్యాయంకోసం వాదించగలిగే నోరు మూసుకోలేను. అన్యాయాన్ని సహించలేను.'

'ఏం చేస్తావేమిటి? కోర్టుకువెళ్తావా?' పరిహాసం ధ్వనించిందా స్వరం నిండుగా.

'చట్టం మనిషిని మార్చలేదు. మనస్సుని జయించలేదు. మార్పును తీసుకుని రాలేదు. అందుకో వింతైన విప్లవం రావాలి. ఆ న్యాయాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించగూడదు. సమర్థించగూడదు. అన్నపూర్ణ అక్కయ్యల్ని పైకి తీసుకురావాలి.'

'ఉపన్యాసం బావుంది.'

'ముల్లు విరిగిన వాళ్లకి బాధ తెలుస్తుంది. ఒక్కటే మాట. అన్నపూర్ణ అక్కయ్య వచ్చేవరకూ నేనూ రాను యింటికి.'

'అదిమాత్రం కలలో కూడా జరగదు.'

'అయితే కరుణకూడా కలలోకైనా రాదు'

'బెదిరించుతున్నావా?'

'కాదు న్యాయంకోసం వాదించుతున్నాను.'

'ఇది కోర్టుగాదు.'

'ప్రతిమనిషి మనస్సూ ఒక కోర్టే. న్యాయానికి ప్రతిమనిషి ఏదో ఒక క్షణాన తలవంచవలసిందే!'

'ఈ నిర్వచనాలన్నీ నా కనవసరం! అన్నపూర్ణ యిక్కడికిరాదు. రాదు.'

'ఎందుకని రాదు? ఏం తప్పు చేసిందని రానీయరు?'

'అంత వాసనలేని పువ్వునే మనిషి భరించలేడు! అందం ఆనందాన్ని సృష్టించుతుంది.'

'ఒక చిన్నసందేహం? మీరు విదేశాల్లో కూడా చదివారు. ఆనందం ఎక్కడుంటుంది.

'మనస్సులో!'

'మనస్సు అందమైనదైతే మనిషి కానపుడు వచ్చిన నష్టమేమిటి?' అన్నాను.

'చదువుకూడా లేదు అన్నపూర్ణకు!'

'అదొక నేరమా? లేక పాపమా?' ఆయన మాట్లాడలేదు. బహుశః ఆలోచనలో పడ్డారేమో!

'నీకు తెలియదు కరుణా! అంత అమాయకత్వాన్ని నేను భరించలేను. అంత కురూపిని చూస్తూ నవ్వలేను.'

'క్షమించండి! మీ మాటల కదుపు వస్తున్నందుకు. మీరు డాక్టరేగా! వ్యాధిని భరించ లేరెవరూ! ఆ భరించరానిదాన్ని

నిర్మూలించి ఆరోగ్యాన్ని అందించుతున్నారు. అందుకు కొన్నిసార్లు చేదు మందుల్ని యిస్తున్నారు. మందు చేదే! కానీ అదే ఆరోగ్యాన్నిస్తుంది. ఏమంటారు?'

'నీమాట కాదనలేను కరుణా! కానీ ప్రతిమనిషీ ఒక బలహీనతకి లొంగిపోతాడు. నేను డాక్టర్నే కావచ్చు కానీ అన్నపూర్ణని మాత్రం ఆహ్వానించ లేను.'

'మరి అక్కయ్య ఏమైపోవాలి? బలహీనత ప్రతివాళ్ళలోనూ వుంటుంది. కాదనను. కానీ ఆ బలహీనత మరో మనిషి జీవితాన్ని బలి తీసుకోవచ్చా? చదువూ, సంస్కృతీ వున్న వాళ్ళే యిలా చేస్తే అక్షరజ్ఞానం లేనివాళ్ళేం చేయాలిక?'

'నీతో వాదించలేను కరుణా!'

'అందం లేదు సరే! అక్కయ్యకు చదువు మీరు నేర్పుకోలేరా? ఇంతమందికి ఎంతో ఓర్పుగా వైద్యం చేస్తూన్న మీకు భార్యకు చదువు నేర్పుకోడానికి ఓపిక లేదా? లేక అభిమానం అడ్డు వస్తుందా?'

'నాకంత గతి పట్టదెపుడూ! అయినా నాకెందుకంత కష్టం?' తిరిగి అభిమానం తలెత్తిందాయనలో.

'మరి అక్కయ్యకెందుకా గతీ, కష్టమూ? ఏం పాపం చేసింది?'

'వెళ్ళి ఆవిడనడుగు! నేను వెళుతున్నాను.'

'ఆగండి! నేనొక్కదాన్నే వెళ్ళను. మీరూ రావాలి!'

'రాను.'

'రావలసిందే?'

'రానని చెప్పాను.'

'మరో నేరాన్ని ఆహ్వానించుతారా అయితే!'

'నేరం!!'

'ఆ! నేరమే! మీరు రాత్రి తెచ్చిన నిద్ర మాత్రలు అల మారులోనే వున్నాయి. పది వేసుకుంటాను. కరుణాదేవి ఆత్మహత్య చేసుకున్నదని మీరే వ్రాసి యివ్వాల్సి వస్తుందపుడు. అలా చేయమంటారా?'

'కరుణా!!...' అంతకు మించి మాట్లాడలేక పోయారాయన.

'అవును. కరుణనే నేను. అక్కయ్యను వెంటబెట్టుకు వద్దాం పదండి. చదువు నేను నేర్పుతాను. మాట్లాడగల నేర్పు చెబుతాను. మీకు నచ్చేవిధంగా తయారు చేస్తాను. పదండి! దయచేసి అడ్డు చెప్పవద్దిక. అక్కయ్య మనసు మల్లె పువ్వు. ఆ మల్లెవాడి పోడానికి వీల్లేదు. అక్క మనస్సు ఘోషించుతోంటే, చెల్లెలికి నిద్ర పట్టదు. సుఖం జీర్ణించదు!' అన్నాను. నాది త్యాగమని నేననుకోను. న్యాయాన్ని త్యాగమెలా అంటారు?

'మీ నాన్నగారేమంటా...'

'నాన్నగారేగాదు! ఆ దేవుడైనా ఏమీ అనడు. అనలేడు. ఎలా అనగలరసలు? అక్కయ్యే మిమ్మల్ని నాకు దానం చేసింది. న్యాయంగా మీరామె సొమ్ము. మధ్యన నేనెవర్ని యివ్వనని అనడానికి? అక్కయ్య, ఈ చెల్లెల్ని కాదనలేదు. నా సుఖ సంతోషాల్ని చూసి ఓర్వలేనంత అసూయ లేదా మనస్సులో.'

'కరుణా! నువ్వు...దేవతవు!'

'అనవసరంగా పొగడకండి. నిజాన్ని అంగీకరించగానే దేవతలమైపోము. పదండి. ఇప్పటికే ఎంతో ప్రొద్దుపోయింది' అన్నాను.

కారు దిగగానే నేనే ముందు వెళ్ళి అక్కయ్యను పిలిచాను. ప్రక్కన ఆయన్ని చూసి నిర్ఘాంతపోయింది. బొమ్మలా నిల్చుండిపోయింది.

'మీ భాస్కరం బావగారూ, కరుణ చెల్లాయి వచ్చారు. లోనికి రమ్మంటావా అక్కా?' అన్నాను.

నాకు తెలుసు. ఆయన్ని చూసి తనను తాను మరిచిపోయింది. ఈ దేవతనా నేను మోసం చేసిందని అనుకుంటున్నారేమో ఆయన. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

'బావా!' కన్నీరాగటం లేదు అక్కయ్యకు.

'ఛా! ఏడవకు ? అక్కా! ఆయన నీవారు. ఎవ్వరూ లాక్కుపోలేరిక. నాకే యింత చోటివ్వండి మీరు!' అన్నాను.

'ఆ! నీకా! చెల్లాయ్! నేను చోటివ్వాలా!'

'అమ్మా! కరుణ తల్లీ! నూరేళ్ళు వర్ధిల్లు! నా బిడ్డ కాపురం నిలబెట్టావు. కరుణవే తల్లీ నువ్వు నిజంగా!' అన్నారు అక్కయ్య నాన్నారు కన్నీరు తుడుచుకుంటూ.

'అక్కా! పద యిక! మనయింటికి వెళ్దాం!' అంటూ తీసుకుని వెళ్ళి కారులో కూర్చోబెట్టాను ఆయన ప్రక్కనే. మరో వైపున నేను కూర్చున్నాను. అక్కయ్య కన్నులనిండుగా ఆనందమే! కారు జీవన రథంలా కదిలింది. నాన్నగారితో చెప్పాను జరిగినదంతా. ప్రశంసాపూర్ణ దృష్టులతో చూస్తూ అన్నారాయన—

'కరుణా! మమత విలువ తెలిసిన మనిషి వన్పించుకున్నావమ్మా!' అని.

'నిజమే! నాన్నారు అన్నమాట. నేను మనిషినే! అన్పించింది. మనిషిలా వుండాలనే ఆ కరుణావిభుని అనుక్షణం ప్రార్థిస్తున్నాను. అంతేగాదు ఇది న్యాయం అన్నాను నాన్నగారితో. ●

[అంకితం:— అన్నపూర్ణ వంటి అక్కయ్యలకీ, చెల్లెళ్ళకూ మనఃపూర్తిగా అందించుతున్నాను — ఇది సానుభూతిగాదు. కాగూడదు. మేలుకొలుపు కావాలనే నా ఆకాంక్ష—రచయిత్రి]

